క్లుప్తంగా

సీ-క్లాస్ లంకల లీజు పెంపు



సీ-క్లాస్ లంక భూముల్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

పి.గన్నవరం: గతంలో ఏడాది మాత్రమే ఉన్న సీ-క్లాస్ లంక భూముల లీజు పరిమితిని ప్రభుత్వం ఐదేళ్లకు పెంచిందని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. ఈ నేపథ్యంలో డివిజన్‌లోని లంక గ్రామాల్లో ఉన్న సీ-క్లాస్ లంక భూముల సర్వేను శుక్రవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లతో గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పి.గన్నవరం లంకలో సీ-క్లాస్ భూముల్ని పరిశీలించి, రెవెన్యూ అధికారులకు సూచనలిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు ఉన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులపై సమీక్ష

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.10.37 కోట్లతో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనుల ప్రగతిపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష జరిగింది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు జల్‌జీవన్ మిషన్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఇష్టానుసారం గోతులు తవ్వేసి పూడ్చకపోవడాన్ని నిరసించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని జొన్నాడ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అన్నారు. దీనిపై ఎంపీపీ లక్ష్మణరావు, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బి.నరసింహారావు సంబంధిత కాంట్రాక్టర్లను వివరణ అడిగారు. భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులకూ తావు లేకుండా అధికారులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఆలమూరు: వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారాన్ని వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీ శంకర్, ఎం.సుమలత ఆధ్వర్యాన సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్ బేబీ, పి.ఉమ ఆయా గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లారు. పరిశుభ్రత పాటించాలని, నిర్ణీత సమయానికి పౌష్టికాహారం అందించాలని, క్రమం తప్పకుండా చిన్నారులకు ఆటపాటలు నేర్పించాలని సూచించారు. వంటకాలు రుచి చూసి, అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా పాల్గొన్నారు.

ఆ వాహనాలు క్లెయిమ్ చేసుకోవాలి

అయినవిల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నాలుగు మోటార్ సైకిళ్లు, ఓ ట్రక్కు ఆటోను వాటి యజమానులు ఒరిజనల్ రికార్డులు చూపించి, తీసుకోవాలని ఎస్సై ఎస్.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వీటిలో ఏపీ 25ఎం 6942 నంబర్ హీరో హోండా స్ప్లెండర్, టీవీఎస్ స్టార్ సిటీ, ఏపీ 35జె 3805 నంబర్ డిస్కవర్-100, టీఎస్ 08 ఈఎన్ 8756 నంబర్ ఎస్‌సీటీఎస్ మోటార్ సైకిళ్లతో పాటు ఏపీ 31 టీబీ 8431 నంబర్ మహీంద్ర మాగ్జిమా ట్రక్ ఆటో ఉన్నాయని వివరించారు. వీటిని ఎవరూ క్లెయిమ్ చేయకుంటే బహిరంగ వేలం వేస్తామని తెలిపారు.

కొబ్బరి తోటలను కాపాడాలి

మలికిపురం: సముద్ర తీర ప్రాంతంలోని కొబ్బరి తోటలను కాపాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ కోరారు. మలికిపురంలో గురువారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పునీటి బారిన పడి వందలాది ఎకరాల్లో వేలాది కొబ్బరి చెట్లు చనిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేసి, ప్రణాళిక రూపొందించాలన్నారు. కొబ్బరి రైతుల సమస్యలపై అధ్యయనానికి ఈ నెల 19న కిసాన్ రాష్ట్ర మోర్చా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి రాజోలు దీవిలో పర్యటిస్తారని వెల్లడించారు. సుంకర రఘునాథరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ఇన్‌చార్జి పద్మావర్మ, అధ్యక్షుడు విల్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై స్పందించాలి

మలికిపురం: స్పందన అర్జీలు, ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని కొబ్బరి అభివృద్ధి బోర్డు మాజీ సభ్యుడు, లక్కవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి సత్య సీతారామరాజు కోరారు. గ్రామంలో పంట కాలువల ఆక్రమణపై మూడు నెలలుగా పలు వినతిపత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణల వల్ల రైతులు సాగునీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నారన్నారు.

పేదల కళ్లల్లో ఆనందం చూడాలని..

- మూడు నియోజకవర్గాల్లో కొత్తగా 3,928 పెన్షన్లు మంజూరు
- జగనన్న న్యూ ఇయర్ కానుక



లబ్ధిదారులకు అందించే పెన్షన్ కానుక కార్డులు

మామిడికుదురు: కొత్త సంవత్సరంలో అడుగు పెట్టిన ప్రజలకు ప్రభుత్వం నూతన సంవత్సర కానుక అందించింది. ప్రతి నెలా ఇస్తున్న పెన్షన్‌ను రూ.2,750కి పెంచడంతో పాటు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ శుభవార్త అందించింది. గ్రామసభల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక అందుకుంటున్న లబ్ధిదారులు ఆనందంతో మురిసిపోతున్నారు. పెంచిన పెన్షన్ కానుక, కొత్త పెన్షన్లతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖలను సైతం వలంటీర్లు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. 'మీ కళ్లలో ఆనందం చూడాలని, మీ జీవితంలో సంతోషం నింపాలనుకుంటున్నాను' అంటూ లేఖలో సీఎం జగన్ పేర్కొన్న మాటలు ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. అటు సంక్షేమ పథకాలతో పాటు ఇటు పెన్షన్లకు కూడా భారీగా నిధులు ఇవ్వడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మూడు నియోజకవర్గాల్లో పెన్షన్ల వివరాలు

నియోజకవర్గం	పాత పెన్షన్లు	కొత్తవి
పి.గన్నవరం	39,056	1,294
కొత్తపేట	43,194	1,487
రాజోలు	30,444	1,147
మొత్తం	1,12,694	3,928

ప్రతి నెలా ఇస్తున్న పెన్షన్ల మొత్తం: రూ.31.47 కోట్లు

వెంటనే మంజూరైంది



వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం పెద్దగా శ్రమ పడలేదు. సచివాలయంలో దరఖాస్తు చేసిన వెంటనే మంజూరు చేశారు. అన్ని వర్గాలకూ జగన్ వరాలు ఇస్తున్నారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న మంచి పనులకు దేవుని చల్లని దీవెనలు ఎళ్ల వేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.

– రుద్రాక్షుల లక్ష్మి, మొగలికుదురు



చాలా ఆనందంగా ఉంది



కొత్తగా పెన్షన్ మంజూరవడం చాలా ఆనందంగా ఉంది. వలంటీర్ మా ఇంటికి వచ్చి, వివరాలు తీసుకుని వెళ్లింది. పెన్షన్ మంజూరైన విషయం కూడా ఆమె ద్వారానే తెలుసుకున్నాను. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తీరు చాలా అభినందనీయం.

– లక్కింశెట్టి సుబ్రహ్మణ్యం, మామిడికుదురు

వితంతు పెన్షన్ మంజూరు



మాది పేద కుటుంబం. కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్ నా జీవనానికి ఎంతో ఉపయోగపడుతుంది. దీనిని ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న కొత్త సంవత్సర కానుకగా భావిస్తున్నాను. గతంలో ఎన్నడూ చూడనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్ నిండు నూరేళ్లూ చల్లగా ఉండాలి.

– బొలిశెట్టి సరస్వతి, మగటపల్లి

పింఛన్ల పండగ

- పలుచోట్ల కొత్త పెన్షన్ల మంజూరు
- అందజేసిన ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు
- లబ్ధిదారుల ఆనందం

కొత్తపేట: కొత్తగా మంజూరైన సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీతో వివిధ ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. కొత్తపేట మండలంలో 326 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో కొత్తగా 1,487 మందికి పింఛన్లు మంజూరు చేశారని, మొత్తం 43,194 మందికి రూ.11.77 కోట్ల మేర ప్రతి నెలా లబ్ధి చేకూరుస్తున్నారని వివరించారు. అర్హతే ప్రామాణికంగా,



రావులపాలెంలో కొత్త పింఛన్‌ను లబ్ధిదారుకు అందిస్తున్న జగ్గిరెడ్డి



కొత్తపేటలో కొత్త పింఛన్ల లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న విప్ చిర్ల జగ్గిరెడ్డి

కుల, మత, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. టీడీపీ వారు ఇదేం ఖర్మ అంటూ గగ్గోలు పెట్టడాన్ని దుయ్యబట్టారు. అటువంటి తప్పుడు వైఖరి ఫలితంగానే చంద్రబాబు నిర్వహించిన సభల్లో 11 మంది మృత్యువాత పడ్డారని అన్నారు. మంచి మాట్లాడాలని హితవు పలికారు. 14 ఏళ్ల టీడీపీ హయాంలో పొందిన లబ్ధి ఎంత? మూడున్నరేళ్ల జగన్ పాలనలో పొందిన లబ్ధి ఎంతో పరిశీలించాలని, పేదల పక్షాన ఉన్న జగన్‌కు మద్దతిస్తారా? ధనికుల పక్షాన నిలిచిన పెత్తందార్లకు మద్దతిస్తారో మనస్సాక్షిగా నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగి ఈ సభలో జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, రాష్ట్ర నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు,



అంబాజీపేటలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

వైస్ ఎంపీపీలు బండారు సత్యమంగతాయారు, దంగేటి వెంకట నాగమణి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు మహ్మద్ హరుణ్, డీఎల్‌డీఓ పి.విజయ్ థామస్, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

రావులపాలెం: టీడీపీ ప్రభుత్వం మాదిరిగా నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల రికమండేషన్లు లేకుండా.. కేవలం అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తోందని విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 435 పింఛన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు. మొత్తంగా మండలంలో 11,838 మందికి సుమారు రూ.3.14 కోట్ల మేర ప్రతి నెలా పింఛనుదార్లకు అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో క్షీరాభిషేకం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు గన్నవరపు వెంకట్రావు, బొక్కా ప్రసాద్, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు సామాజిక భద్రత

అంబాజీపేట: అర్హులైన ప్రతి అవ్వాతాతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక భద్రత కల్పిస్తున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సభలో మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. మండలంలో 319 కొంత పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మండలంలో మొత్తం 9,340 పింఛన్ల లబ్ధిదార్లకు ప్రతి నెలా రూ.2,37,51,850 పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కర్నాసుల సీతారామాంజనేయులు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కొర్లపాటి కోటబాబు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగన్‌కు అండగా నిలవండి



గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: ప్రతి కులంలోనూ పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలన్న తపనతో పని చేస్తున్న సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. కరవాక గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బ్రోచర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ, పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని జగన్ ప్రగతిపథంలో నడిపిస్తున్నారని అన్నారు. తమకు ఆశీస్సులు అందించి, మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రోత్సాహం అందించాలని కోరారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.52 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి పైప్‌లైనుతో పాటు సంపు నిర్మాణాలకు ఎమ్మెల్యే వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సందాడి పార్థీశ్వరవర్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి సర్వే పరిశీలన



క్షయ వ్యాధి సర్వేను పరిశీలిస్తున్న వైద్య బృందం

రాజోలు: క్షయ వ్యాధి సర్వేను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైద్య బృందం గురువారం పొదలాడ గ్రామంలో పరిశీలించింది. కాకినాడ నుంచి డాక్టర్ సుజాత ఆధ్వర్యాన డాక్టర్ సీహెచ్ పుష్కరరావు, డాక్టర్ సౌమ్యలతో వచ్చిన బృందం పొదలాడ ఇందిరా కాలనీలో ఇంటింటా తిరిగి క్షయ వ్యాధి సర్వే తీరును పరిశీలించింది. 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సర్వే చేపట్టాయన్నారు. ఇందులో భాగంగా ఈ వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించి, రోగులు కోలుకునేంత వరకూ వైద్య సదుపాయం అందిస్తున్నామని వివరించారు. తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్, ఎంపీహెచ్ఈఓ కేవీవీ సత్యనారాయణ, పీపీఎం కో ఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: క్షయ లక్షణాలున్న వారి నమూనాలు తక్షణమే సేకరించి, పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ పుష్కరరావు, సుజాత, సౌమ్య అన్నారు. క్షయ వ్యాధిపై మాచవరంలో జరుగుతున్న సర్వేను అంబాజీపేట వైద్యాధికారి డాక్టర్ వి.గౌతమి ఆధ్వర్యాన వారు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, సీహెచ్ఓ అప్పారావు, టీబీ యూనిట్ పర్యవేక్షకులు జి.సర్వారాయుడు, కేఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆధునీకరణకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు

పి.గన్నవరం: పోతవరం గణేష్ నగర్ నుంచి ఆర్.ఏనుగుపల్లి వరకూ రోడ్డు ఆధునీకరణ పనులకు రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆర్‌అండ్‌బీ ఏఈ జె.రాజేంద్ర తెలిపారు. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. 4.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఐదు గ్రామాల ప్రజల ఇబ్బందులకు తెర పడుతుంది.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత

మలికిపురం: మండలంలోని లక్కవరం, గొల్లపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.50 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈపీడీసీఎల్ ఏఈ మద్దూరి సతీష్ ఈ విషయం గురువారం తెలిపారు. విద్యుత్ లైన్లకు వార్షిక మరమ్మతుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలో..

అంబాజీపేట: గంగలకుర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నారు. ఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ ఈ విషయం తెలిపారు. గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి, అమలాపురం రూరల్ పాలగుమ్మి, నడిపూడి, ఎస్.పెదపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33/11 కేవీ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు చేయనున్నామని తెలిపారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: విద్యుత్ స్తంభాలు ఎత్తు చేయడం వంటి పనుల నిమిత్తం అయినవిల్లి, వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక, ముక్తేశ్వరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు రవికుమార్ తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

అయినవిల్లి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చింతనలంకలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పేదవారి సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ ఇప్పటికే సంక్షేమ పథకాలు అందిస్తూ వారి మన్ననలు అందుకుంటున్నారన్నారు. ప్రజల స్పందన చూస్తుంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం కడతారనే విషయం స్పష్టమవుతోందని చిట్టిబాబు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యులు చల్లబత్తుల సాయిలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతిలోగా చాకలిపాలెం రోడ్డు ఆధునీకరణ

పి.గన్నవరం: ఎల్.గన్నవరం – వాడ్రేవుపల్లి మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే చిట్టిబాబు పరిశీలించారు. రూ.6 కోట్లతో ఈ రోడ్డును ఆధునీకరిస్తున్నారు. పనుల ఎమ్మెల్యేకు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు

ప్రగతిని ఆర్‌అండ్‌బీ ఏఈ జె.రాజేంద్ర వివరించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ, సంక్రాంతి పండగలోగా ఈ రోడ్డు పనులు పూర్తవుతాయని చెప్పారు. ఇప్పటికే ఎల్.గన్నవరం – చాకలిపాలెం సెంటర్ మధ్య 8.5 కిలోమీటర్ల మేర ఒక పొర తారు రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మరో కిలోమీటరు మేర వాడ్రేవుపల్లి జంక్షన్ వరకూ పనులు జరగాల్సి ఉందన్నారు. అనంతరం ఎల్.గన్నవరం నుంచి రెండో పొర బీటీ రోడ్డు వేసి పనులు పూర్తి చేస్తారని వివరించారు. పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆదేశించారు.

సంక్షిప్తంగా...

గ్రామాభివృద్ధికి చర్యలు

అంబాజీపేట: ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక పెద్దల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుస్తామని మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఆమె అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని సర్పంచ్ శాంతకుమారి చెప్పారు. ఉప సర్పంచ్ సుంకర పేరయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలలో వినతులివ్వండి

మలికిపురం: సాగునీటి సమస్య తలెత్తితే ఆయా గ్రామాల రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకే)లో వినతిపత్రాలివ్వాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ రైతులకు గురువారం సూచించారు. డ్రైన్ల పనితీరుతో పాటు ఇరిగేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్రమణ అడ్డగింపు

అంబాజీపేట: ముక్కామల పంచాయతీ ఖండవిల్లివారిపేట సమీపాన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాన్ని గ్రామస్తులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. ముక్కామల – నేదునూరు రోడ్డును ఆనుకుని ఉన్న కొబ్బరి వ్యాపారికి చెందిన స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని వేరొకరికి అద్దెకు ఇచ్చారని ఆరోపించారు. ఆ స్థలం తనదేనని కొబ్బరి వ్యాపారి, ఇరిగేషన్ వారిదని, పక్కా ప్రభుత్వ భూమి అని మరికొందరు చెబుతున్నారు. ఇదే స్థలంలో బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు, విగ్రహాల ఏర్పాటుకు మరో వర్గం ప్రయత్నిస్తోంది.

దైవ దూషకులపై కేసులు నమోదు చేయాలి

రావులపాలెం: తెలంగాణలోని కొందరు హిందూ దేవుళ్లను దూషించడాన్ని నిరసిస్తూ ప్రగతి భారతమ్ ట్రస్ట్ ఆధ్వర్యాన పోస్టాఫీసు వీధి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ గురువారం ర్యాలీ చేశారు. దోషులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని నినదించారు. తహసీల్దార్ వీవీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు తమలంపూడి రామకృష్ణారెడ్డి, పడాల తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఊరేగింపు

రావులపాలెం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్థానిక అభయాంజనేయ స్వామి వారి ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, ట్రాక్టర్లపై వివిధ వేషధారణలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

స్కాలర్‌షిప్, సర్టిఫికెట్ల పంపిణీ

అయినవిల్లి: చింతనలంక జెడ్పీ హైస్కూలులో ఐదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్పులు, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం అందజేశారు. అలాగే అగ్నిప్రమాదంలో ఇల్లు, పుస్తకాలు కాలిపోయిన 9వ తరగతి విద్యార్థిని నక్కా రేణుకకు రూ.5 వేలు అందజేశారు. హెచ్ఎం పీవీ రవిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుమ్మిలేరులో గ్రామసభ

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు అధ్యక్షతన గురువారం గ్రామసభ జరిగింది. గత నెలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కార్యదర్శి డి.సుబ్బారావు వివరించారు. ఈ నెలలో చేపట్టే కార్యక్రమాలపై పాలకవర్గాన్ని అడిగి తెలుసుకున్నారు.

రెండో రోజుకు చేరిన రుగ్వేద సభలు

పి.గన్నవరం: ముంగండ చింతామణి గణపతి మందిరంలో జరుగుతున్న సంపూర్ణ రుగ్వేద సంహిత పారాయణ, వేద విద్వత్ మహాసభలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన రుగ్వేద పండితులు వేద పఠనం చేశారు. శ్రీ అశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరుల ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమాలు జరిగాయి.

కొనసాగిన అధ్యయనోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో నాలుగో రోజైన గురువారం కూడా స్వామివారి అధ్యయనోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు కొలువుదీర్చారు. అనంతరం ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు విష్వక్సేన పూజతో నాలుగో రోజు విశేష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అంబాజీపేట: మాచవరం శివాలయం వెనుక ఉన్న శ్మశానవాటిక రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎంపీపీ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

శిథిల వాటర్ ట్యాంకు తొలగింపు

మామిడికుదురు: మొగలికుదురు జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంకును గురువారం తొలగించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన రెండు జేసీబీల సాయంతో ట్యాంకును కూల్చివేశారు. సర్పంచ్ కడి అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఈ పనులు నిర్వహించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

ఆత్రేయపురం: మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.మురళీమోహన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్‌వీవీఎస్ఎన్ ప్రసాద్, అధ్యక్షుడిగా ఎంవై ప్రసాదరావు, సహ అధ్యక్షులుగా ఎం.సురేష్‌బాబు, డి.లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సుధాకర్ బాబు, కోశాధికారిగా కడలి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు జిల్లా కౌన్సిలర్లను, ఆఫీస్ బేరర్లను కూడా ఎన్నుకున్నారు.

ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఏర్పాటు

అంబాజీపేట: మండల ఫొటోగ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని మనం ఫొటో, వీడియో, ట్రేడ్‌వర్కర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుమోహన్ సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బొబ్బిలి రమేష్, కార్యదర్శిగా వంకా శ్రీనివాస్, ట్రెజరర్‌గా ర్యాలీ శ్రీరామసతీష్ ఎన్నికయ్యారు.

పంచాయతీ చెరువు వద్ద పారిశుధ్య పనులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీ చెరువులో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ చెరువులో చేపలు చనిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు పీహెచ్‌సీ ఉద్యోగులతో కలిసి చెరువును పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. రెండు రోజులతో పోలిస్తే ఇప్పుడు దుర్వాసన తగ్గిందని స్థానికులు తెలిపారు.

వేంకటేశ్వరునికి లక్ష తులసి పూజ

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలోని శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష తులసి పూజ వైభవంగా జరిగింది. పాణింగపల్లి నరసింహాచార్యులు పర్యవేక్షణలో పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యాన ఈ పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.

వాడ్రేవుపల్లిలో ఇదేం ఖర్మ

పి.గన్నవరం: వాడ్రేవుపల్లిలో గురువారం జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రత్తిపాటి వెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి, రాష్ట్ర నేతలునామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పి.గన్నవరం: మొండెపులంక బొంతువారిపేటలో జనని ఫౌండేషన్ చైర్మన్ సరెళ్ల ప్రసాద్ కుమార్ ఆధ్వర్యాన గురువారం 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో 12న యువశక్తి

మలికిపురం: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈ నెల 12న యువశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జనసేన నియోజకవర్గ నాయకుడు గెద్దం మహాలక్ష్మీ ప్రసాద్ గురువారం తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటారన్నారు.